అభివృద్ధి పనులకు స్థలాల కేటాయింపుపై సమీక్ష

మంథని, న్యూస్‌టుడే: మంథనిలో చేపట్టనున్న అభివృద్ధి పనులకు అవసరమైన స్థలాలను సత్వరమే కేటాయించాలని కలెక్టర్ శ్రీహర్ష ఆదేశించారు. మంగళవారం ఆయన వివిధ అభివృద్ధి పనులపై మంథని ఆర్డీవో కార్యాలయంలో రెవెన్యూ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సామాజిక వైద్యశాలకు 3 ఎకరాలు, తహసీల్దారు, రెవెన్యూ డివిజనల్ కార్యాలయానికి, ఆర్అండ్‌బీ కార్యాలయ భవనానికి కలిపి 2.21 ఎకరాలు, కళాభారతి నిర్మాణానికి 8 గుంటలు, ఆర్అండ్‌బీ అతిథిగృహానికి, సామాజిక భవన నిర్మాణానికి ఒక ఎకరం, విద్యుత్తు ఉపకేంద్రం నిర్మాణానికి 30 గుంటలు, అడవిసోమన్‌పల్లిలో సమీకృత గురుకుల భవన నిర్మాణానికి 25 ఎకరాల ప్రభుత్వ భూమి కేటాయింపునకు చర్యలు తీసుకోవాలని సూచించారు. మంథని పట్టణంలో దేవాదాయ శాఖ పరిధిలో అనుకూలమైన భూములుంటే ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం ఆ శాఖకు చెల్లించి భూములు సేకరించాలని ఆదేశించారు. ఆదనపు కలెక్టర్ అరుణశ్రీ, ఆర్డీవో హనుమానాయక్, తహసీల్దార్ రాజయ్య, మున్సిపల్ ఛైర్‌పర్సన్ రమాదేవి, కమిషనర్ మనోహర్, ఆర్అండ్‌బీ ఈఈ భావ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీహర్ష

పల్లెల సుస్థిర ప్రగతికి ప్రణాళికలు

పెద్దపల్లి కలెక్టరేట్: పల్లెల సుస్థిర అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ శ్రీహర్ష సూచించారు. మంగళవారం సమీకృత పాలనా ప్రాంగణంలో హసన్‌పర్తి ఎక్స్‌టెన్షన్ ట్రైనింగ్ కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ప్రగతి పనులు గుర్తించాలని అధికారులకు సూచించారు. ప్రతి పనికీ గ్రామసభ ఆమోదం అవసరమన్నారు. అభివృద్ధి ప్రణాళికలను పోర్టల్‌లో నమోదు చేయాలని చెప్పారు. జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య, ఈటీసీ కళాశాల ప్రిన్సిపల్ విజయనాయక్, ఎంపీడీవో, కార్యదర్శులు పాల్గొన్నారు.

కొర్రీలు లేకుంటే కొండంత అండ

విత్తనం నుంచి కోత వరకు పంటల సాగులో నానా కష్టాలు పడుతున్న రైతులు చేతికొచ్చిన ధాన్యాన్ని విక్రయించడానికీ అవస్థలు పడాల్సి వస్తోంది. అన్నదాతకు మద్దతు ధర అందించేందుకు ప్రభుత్వం ప్రతి సీజన్‌లో కొనుగోలు కేంద్రాలు నిర్వహిస్తున్నా మిల్లర్లు, నిర్వాహకుల చేతుల్లో మోసాలు తప్పడం లేదు. రోజుల తరబడి కేంద్రాల్లో పడిగాపులు, వర్షాలు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి.

న్యూస్‌టుడే, పెద్దపల్లి కలెక్టరేట్

వానాకాలం వరి పైర్లు కోత దశలో ఉన్నాయి. దసరా తర్వాత కోతలు ప్రారంభం కానుండగా కొనుగోలు కేంద్రాలకు సంబంధించి ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఏటా తూకంలో కోతలు, తేమ పేరిట కొర్రీలతో నష్టపోతున్న నేపథ్యంలో ఈసారైనా ఇబ్బందులు లేకుండా ఉన్నతాధికారుల పర్యవేక్షణ పెరగాలని రైతులు కోరుతున్నారు.

జాప్యంతో నష్టం

- అకాల వర్షాలతో ధాన్యం తడిసిపోతున్నందున కొనుగోలు కేంద్రాలను ఎత్తయిన ప్రదేశాల్లో నిర్వహించాలి. చాలా చోట్ల స్థల సమస్యతో కల్లాలను లోతట్టు ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తుండటంతో రైతులు నష్టపోతున్నారు.
- కొనుగోలు కేంద్రాల నిర్వహణ బాధ్యతను ఏళ్ల తరబడి ఒకరికే బాధ్యతలు అప్పగిస్తుండటంతో అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపణలున్నాయి.
- ధాన్యాన్ని సంచి బరువుతో కలిపి 40.650 కిలోలకు తూకం వేయాల్సి ఉండగా అదనంగా 2 నుంచి 4 కిలోల వరకు వేస్తున్నారు.

ధాన్యం సేకరణలో అడ్డంకులు అధిగమిస్తే మేలు

- సకాలంలో ట్రక్‌షీట్లు ఇవ్వకుండా మిల్లర్లు జాప్యం చేస్తున్నారు. దీంతో డబ్బులు జమ కావడం లేదు.
- తూకం వేసిన ధాన్యం తరలింపులో జాప్యంతో సంచుల్లోనే మొలకెత్తుతోంది. గన్నీ సంచుల కొరత ఉంది.

అడుగడుగునా మోసం

కొనుగోలు కేంద్రాల్లో ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న ధాన్యాన్ని మాత్రమే తూకం వేస్తున్నారు. అయినా మిల్లర్లు తరుగు, తాలుతో కోతలు విధిస్తూ దోచుకుంటున్నారు. సీజన్ మొదట్లో అధికారుల పర్యవేక్షణ బాగానే ఉంటున్నా క్రమంగా తగ్గుతోంది. దీంతో నిర్వాహకులు, మిల్లర్లు కుమ్మక్కై రైతులను ముంచుతున్నారు. తూకంలోనూ వరుస క్రమం పాటించకుండా పలుకుబడి ఉన్న వారికి పెద్దపీట వేస్తున్నారు. రోజుల తరబడి ధాన్యం నిల్వ ఉండటంతో అకాల వర్షాలకు రైతులు నష్టపోవాల్సి వస్తోంది.

నిర్ణీత ప్రమాణాలు ఇలా(శాతం)	
తాలు, చెత్త:	1
మట్టి పెళ్లలు, రాళ్లు:	1
పాడయిన, రంగు మారిన, మొలకెత్తిన, పురుగులు తిన్న ధాన్యం:	5
ముడుచుపోయిన ధాన్యం:	3
తక్కువ శ్రేణి మిశ్రమం:	6

సమన్వయ లోపం

- ధాన్యం సేకరణలో పౌర సరఫరాలు, జిల్లా సహకార, వ్యవసాయ, రెవెన్యూ తదితర శాఖల మధ్య సమన్వయం లోపిస్తోంది.
- లారీల్లో బస్తాలు నింపే క్రమంలో కొంత ధాన్యం రాలిపోతోంది. మిల్లర్లు తూకం వేస్తుండగా తరుగు వస్తోంది. నాసిరకం గన్నీ సంచులతోనూ రైతులు నష్టపోతున్నారు.
- మిల్లులకు తరలించే ధాన్యాన్ని ఎప్పటికప్పుడు దింపుకొనేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.
- మంథని, ముత్తారం, రామగిరి, కాల్వశ్రీరాంపూర్, పెద్దపల్లి మండలాల్లో ధాన్యం సేకరణలో జాప్యం నివారించాలి.
- కొర్రీలు విధించిన ధాన్యాన్ని కేంద్రాల నిర్వాహకులు తమ బంధువుల పేరిట ఆన్‌లైన్‌లో నమోదు చేసి డబ్బులు దండుకుంటున్నారు.


సుల్తానాబాద్‌లో మిల్లుల ముందు బారులు తీరిన ధాన్యం లారీలు(పాతచిత్రం)

- మంథని మండలం నాగేపల్లి సహకార సంఘం కొనుగోలు కేంద్రంలో కోతలు విధించి డబ్బుల చెల్లింపులో జాప్యం చేస్తున్నారంటూ రైతులు పోలీసులను ఆశ్రయించారు. నాలుగు నెలల తర్వాత డబ్బులో కోతలు విధించి చెక్కులు అందజేశారు.
- పెద్దపల్లి మండలం అప్పన్నపేట, రాఘవపూర్ కేంద్రాల్లో ప్రతి సీజన్‌లో ధాన్యం సేకరణ ఆలస్యం అవుతుండటం, రైతులు ఆందోళనకు దిగడం పరిపాటిగా మారింది. ఇక్కడ లోతట్టు ప్రాంతాల్లో కేంద్రం నిర్వహణతో కొద్దిపాటి వర్షానికే ధాన్యం తడుస్తోంది.

గత ఇబ్బందులపై సమీక్షిస్తున్నాం

ధాన్యం సేకరణలో గతంలో ఎదురైన సమస్యలను సమీక్షిస్తున్నాం. కేంద్రాల నిర్వాహకులపై నిఘా పెంచుతున్నాం. కొన్ని చోట్ల కొనుగోలు బాధ్యతలు కొత్త వారికి ఇవ్వాలని సూచిస్తున్నాం. తూకంలో మోసాలకు పాల్పడుతున్న వేబ్రిడ్జిలను మూసివేసి నోటీసులు ఇస్తున్నాం. రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం.

-శ్రీకాంత్, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్

రహదారికి హరిత పందిరి


మంథని-కాటారం రహదారి పక్కన బట్‌పల్లి గ్రామ పరిసరాల్లో ఏపుగా పెరిగిన చెట్లు వాహనదారులకు, రైతులకు చల్లటి నీడనిస్తున్నాయి. దారికి గొడుగులా మారిన వృక్షాల కింద ఈ మార్గంలో ప్రయాణించేవారు కాసేపు సేద తీరుతున్నారు. **-న్యూస్‌టుడే, మంథని గ్రామీణం**

కేంద్ర బృందం పర్యటన

పాలకుర్తి, న్యూస్‌టుడే: పాలకుర్తి మండలం పుట్నూరు, గుడిపల్లి గ్రామాల్లో ఎన్ఎల్ఎం (నేషనల్ లెవల్ మానిటరింగ్) కేంద్ర బృందం సభ్యులు బాలమురళి, సునీల్ మంగళవారం పర్యటించారు. పంచాయతీల రికార్డులను తనిఖీ చేశారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టిన పనులు, పథకాలు సక్రమంగా అమలవుతున్న తీరుపై గ్రామ ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీవో శశికళ, ఏపీడీ సత్యనారాయణ, ఈజీఎస్ ఏపీవో కొమురయ్య, ఐకేపీ ఏపీఎం సదానందం, టీఏలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.


గుడిపల్లిలో వివరాలు సేకరిస్తున్న బృంద సభ్యులు

ఆర్ఎఫ్‌సీఎల్ సీఎండీ పర్యటన నేడు

ఫెర్టిలైజర్ సిటీ: రామగుండం ఎరువుల కర్మాగారం(ఆర్ఎఫ్‌సీఎల్) ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ శరవనన్ బుధవారం రామగుండంలో పర్యటించనున్నారు. మంగళవారం హైదరాబాదుకు చేరుకున్న ఆయన.. బుధవారం రామగుండం రానున్నారు. ఉదయం 11 గంటలకు ఫెర్టిలైజర్ సిటీలోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొంటారు. అనంతరం ఎరువుల కర్మాగారం పనితీరు, ఉత్పత్తిపై సమీక్షించనున్నారు.

క్రీడాకారుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి

ధర్మారం, న్యూస్‌టుడే: క్రీడాకారుల సంక్షేమంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పేర్కొన్నారు. నందిమేడారంలో నందినీ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలను మంగళవారం ఆయన ప్రారంభించారు. ధర్మారం మండల పరిషత్తు కార్యాలయం ముందు 476 సర్వే నెంబరులోని ప్రభుత్వ భూమిని స్టేడియంగా అభివృద్ధి చేస్తామన్నారు. ఉమ్మడి జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన 19 జట్లు పోటీల్లో పాల్గొంటున్నాయి. నందినీ యూత్ క్లబ్ అధ్యక్షుడు మ్యాడారం వీర్‌పాల్, వాలీబాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం.కోమల్, ఏఎంసీ ఛైర్మన్ లావుడ్యా రూప్లానాయక్, సహకార సంఘం వైస్ ఛైర్మన్ సామంతుల రాజమల్లు, కాంగ్రెస్ నాయకులు తిరుపతిరెడ్డి, రవీందర్‌రెడ్డి, సీనియర్ క్రీడాకారులు, పీఈటీలు, కోచ్‌లు పాల్గొన్నారు.


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్

బకాయిల చెల్లింపుపై మిల్లర్ల వినతి

సుల్తానాబాద్, న్యూస్‌టుడే: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జిల్లాలోని బియ్యం మిల్లర్లు మంగళవారం అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్‌కు వినతిపత్రం అందజేశారు. వానాకాలం సీజన్ సన్న ధాన్యం దిగుమతి, బ్యాంకు గ్యారంటీ, బియ్యం ఇవ్వడంలో ఎదురయ్యే సమస్యలు, పాత బకాయిల చెల్లింపులు, సీఎంఆర్ మిల్లింగ్ ఛార్జీల పెంపు తదితర సమస్యలు పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని అదనపు కలెక్టర్ హామీ ఇచ్చారని మిల్లర్లు తెలిపారు. మిల్లర్ల సంక్షేమ సంఘం జిల్లా నాయకులు అశోక్‌కుమార్, తిరుపతిరెడ్డి, పురుషోత్తమరావు, జైపాల్‌రెడ్డి, ప్రసాద్, కేశవరావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ పోస్టుల భర్తీ లెక్క తేలింది

71 మందికి నేడు నియామక పత్రాలు

న్యూస్‌టుడే, పెద్దపల్లి కలెక్టరేట్: డీఎస్సీ-24లో ఎంపికైన కొత్త ఉపాధ్యాయులు కొలువు దీరనున్నారు. ఎంపిక పరీక్షలో ప్రతిభ కనబరిచిన వారి వివరాలతో వారం రోజులుగా కుస్తీ పట్టిన అధికారులు తుది జాబితా సిద్ధం చేశారు. వివిధ కేటగిరీల్లో కలిపి జిల్లాలో మొత్తం 93 పోస్టులు ఖాళీగా ఉండగా 5 ప్రత్యేక ఉపాధ్యాయ(స్పెషల్ టీచర్) పోస్టులకు ప్రభుత్వం నుంచి అనుమతి రాలేదు. మిగిలిన 88 పోస్టులకు అన్ని ధ్రువపత్రాలు సక్రమంగా ఉన్న 71 మందిని ఎంపిక చేశారు. ఈ నెల 9న హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి చేతుల మీదుగా వీరు నియామక పత్రం అందుకోనున్నారు. మిగిలిన 17 పోస్టుల్లో భాషా పండితులు 1, స్కూల్ అసిస్టెంట్(బయోసైన్స్)1, ఎస్ఏ గణితం 1(తెలుగు మాధ్యమం), ఎస్ఏ(సాంఘికశాస్త్రం) 2, ఎస్ఏ తెలుగు 1, ఎస్జీటీ(తెలుగు) 1, ఎస్జీటీ(ఉర్దూ) 4, ఎస్జీటీ(స్పెషల్ ఎడ్యుకేషన్) 6 చొప్పున భర్తీకి నోచుకోలేదు. దివ్యాంగ, ఉర్దూ మాధ్యమ కోటాలో అర్హులు లేకపోవడంతో నియామకం జరగలేదు. ఎంపికైన అభ్యర్థులు హైదరాబాద్ వెళ్లేందుకు బుధవారం ఉదయం 6 గంటలకు పెద్దపల్లి కలెక్టరేట్ వద్ద హాజరు కావాలని జిల్లా విద్యాధికారి మాధవి తెలిపారు. గుర్తింపు కార్డు జారీ కోసం అభ్యర్థులు ఒక పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో వెంట తెచ్చుకోవాలని సూచించారు.

విశ్వవ్యాప్తం.. బతుకమ్మ సంబరం 12లో

సైబర్ మోసం.. కొత్త రూపం

అధికారులమని బెదిరిస్తూ డబ్బు స్వాహా

న్యూస్‌టుడే, గోదావరిఖని

లింకు క్లిక్ చేస్తే డబ్బులు మాయం.. కొత్త యాప్‌లు తెరిస్తే ఖాతా నుంచి డబ్బు బదిలీ.. 'వ్యాపారంలో పెట్టుబడి పెట్టండి.. రెండింతల ఆదాయం పొందండి' అంటూ ప్రచారంతో మోసం.. 'మీ చరవాణి నంబర్ లక్కీ డ్రాకు ఎంపికైంది కొంత డబ్బు చెల్లిస్తే బంగారు ఆభరణం మీ చేతికి వస్తుంది' అంటూ దగా..

ఇలా సైబర్ నేరగాళ్లు పలు రకాల మోసాలతో అమాయకులను గతంలో బురిడీ కొట్టించారు.. పాత నేరాలపై అవగాహన పెరిగి జనం జాగ్రత్త పడుతుండటంతో కొత్త రూపాలెత్తుతున్నారు.. తాజాగా పోలీసుల అవతారమెత్తి మోసాలకు పాల్పడుతున్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లాలో రూ.15.82 కోట్లను సైబర్ నేరగాళ్లు బాధితుల నుంచి కొల్లగొట్టారు. కొత్త కొత్త రూపాల్లో వస్తున్న సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉంటేనే సొమ్ము భద్రంగా ఉంటుంది. ఏ మాత్రం నిర్లక్ష్యం ప్రదర్శించినా డబ్బు క్షణాల్లో వారి చేతుల్లోకి వెళ్లే అవకాశం ఉంది.


ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది ఇప్పటివరకు..

నమోదైన కేసులు : 1,788

సైబర్ నేరగాళ్లకు బదిలీ అయిన డబ్బు : రూ. 19,29,51,036

సకాలంలో స్పందించడంతో బదిలీ కాకుండా ఆపగలిగింది : రూ. 3,46,81,599

మోసం ద్వారా జనం నష్టపోయిన మొత్తం : రూ. 15,82,69,437



డబ్బు పోయిందా.. తిరిగి రాదు

గుర్తు తెలియని వ్యక్తి బెదిరించగానే చెప్పిన ఖాతాకు డబ్బులు పంపిస్తున్నారు. ఒక్కసారి డబ్బు వారి ఖాతాలోకి చేరిందంటే తిరిగి రావడమంటూ ఉండదు. ఒకవేళ మోసపోయినా గంటలోపు గుర్తించి 1930కు సమాచారం అందిస్తే 90 శాతం సొమ్మును బదిలీ కాకుండా సైబర్ క్రైం పోలీసులు ఆపగలుగుతారు. ఆలస్యమైన కొద్దీ నిలువరించే శాతం తగ్గుతుంది.

ఉమ్మడి జిల్లాలో తాజా మోసాలిలా

- నీ మీద మనీ లాండరింగ్ కేసు నమోదైంది. మేము ముంబయి పోలీసులం. కేసు లేకుండా ఉండాలంటే మేము చెప్పిన బ్యాంకు ఖాతాలో డబ్బు జమ చేయాలి.
- మేము సీబీఐ ఆఫీసు నుంచి మాట్లాడుతున్నాం. మీపై కేసు నమోదైంది. అరెస్టు చేయకుండా ఉండాలంటే చెప్పిన బ్యాంకు ఖాతాలో డబ్బు వేయాలి. లేదంటే విచారణ కోసం సీబీఐ కార్యాలయానికి తీసుకెళ్తాం.
- దిల్లీ పోలీసులం మాట్లాడుతున్నాం. గంజాయి రవాణా చేస్తుండగా మీ అబ్బాయి పట్టుబడ్డాడు. వెంటనే డబ్బు పంపిస్తే వదిలేస్తాం.
- అక్రమ లావాదేవీలపై విచారణ చేస్తున్నాం. అందులో మీ ప్రమేయమున్నట్లు అనుమానం ఉంది. విచారణ కోసం సెక్యూరిటీ డిపాజిట్ చేయాలి. అందులో మీ ప్రమేయం లేదని తేలితే డబ్బు తిరిగిచ్చేస్తాం.

అప్రమత్తతే శ్రీరామరక్ష

- చరవాణిలకు వచ్చే తెలియని లింకులను తెరవకూడదు.
- గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి బెదిరించినా స్పందించకూడదు. పోలీసులకు సమాచారం ఇవ్వాలి.
- రుణాలు మంజూరయ్యాయంటే నమ్మకూడదు. అలాంటి యాప్‌ల జోలికి వెళ్లకూడదు.
- పోలీసులమని ఫోన్ చేసే వ్యక్తుల మాటలను నమ్మకండి. వారు సరైనవారా కాదా అని నిర్ధారించుకోండి. అవసరమైతే మీ పరిధిలో ఉన్న పోలీసులకు తెలియజేయండి.
- ఆన్‌లైన్ వ్యాపారం పేరుతో కూడా సైబర్ నేరగాళ్లు యాప్‌లను పంపిస్తుంటారు. పెట్టుబడి పెడితే రెండింతలవుతుందని నమ్మిస్తారు. వీటిపై కూడా జాగ్రత్తగా ఉండాలి.

ప్రజల సహకారం అవసరం

సైబర్ మోసాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. అయినా ప్రజలు మోసగాళ్ల వలలో పడుతున్నారు. కొత్త కొత్త రూపాల్లో సైబర్ నేరగాళ్లు వస్తున్నారు. అప్రమత్తతతో గుర్తించాలి.

- వెంకటరమణ, రామగుండం సైబర్‌క్రైం ఏసీపీ

ఫొటో, వీడియోగ్రాఫర్ల పోటీకి ఆహ్వానం

గోదావరిఖని: పోలీసు ఫ్లాగ్ డే సందర్భంగా అమరవీరుల త్యాగాలను గుర్తుచేసే విధంగా తీసిన ఫొటో, వీడియోలను తమకు పంపించాలని రామగుండం పోలీసు కమిషనర్ శ్రీనివాస్ వెల్లడించారు. ఆసక్తి ఉన్నవారు ఈనెల 20 లోపు కమిషనరేట్ ఎన్ఐబీ కార్యాలయం, లేదంటే పీఆర్‌వోకు 10x 8 సైజు ఫొటోలు పంపించాలన్నారు. లఘుచిత్రం పెన్‌డ్రైవర్ ద్వారా అందజేయాలని, పూర్తి వివరాలు అందులో ఉండాలన్నారు. వీటిని డీజీపీ కార్యాలయానికి పంపిస్తామని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 8712656596, 8712656587 నెంబర్లను సంప్రదించాలన్నారు.

తహసీల్దారు కార్యాలయ భవనాలకు నిధులు

మంథని, న్యూస్‌టుడే: ముత్తారం, ఓదెల మండలకేంద్రాల్లో తహసీల్దారు కార్యాలయ భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తూ కలెక్టర్ శ్రీహర్ష ఉత్తర్వులు జారీ చేశారు. రూ.60 లక్షల చొప్పున మంజూరు చేస్తూ పంచాయతీ రాజ్ డీఈఈలకు, తహసీల్దార్లకు ఉత్తర్వులు పంపారు.

విశ్వవ్యాప్తం.. బతుకమ్మ సంబరం

తీరొక్క పూలతో సంస్కృతీ సంప్రదాయాలను పూయిస్తున్న బతుకమ్మ.. కొన్నేళ్లుగా విశ్వవ్యాప్తంగా సందడి చేస్తోంది. మన పండగ అనే భావనతో వివిధ దేశాల్లో స్థిరపడిన వారంతా పోటీపడి వేడుకలు నిర్వహిస్తున్నారు. చిన్నా పెద్దా తేడా లేకుండా కార్యక్రమాల్లో పాల్గొంటుండగా ఆసక్తికరమైన పోటీలు నిర్వహిస్తూ ఈ పండగకు నిర్వాహకులు వన్నె తెస్తున్నారు. రాష్ట్రం నుంచి రాజకీయ నాయకులు, సినీతారలు, బుల్లితెర నటులు, ఆయా దేశాల్లోని భారత రాయబార కార్యాలయాల అధికారులు, వివిధ దేశాల ప్రజాప్రతినిధులు బతుకమ్మ వేడుకల్లో పాల్గొంటున్నారు.
న్యూస్‌టుడే, మేడిపల్లి



ఎడారి దేశాల్లో పూల సందడి

గల్ఫ్ దేశాల్లో బతుకమ్మ వేడుకలకు విశేష స్పందన వస్తోంది. ఉమ్మడి జిల్లా నుంచి ఆయా దేశాలకు వెళ్లిన వారికి ఈ వేడుకలు ఆనందాన్నిస్తున్నాయి. దుబాయిలో గల్ఫ్ తెలంగాణ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 17 ఏళ్లుగా వేడుకలు నిర్వహిస్తున్నారు. ఎమిరేట్స్ తెలంగాణ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అక్టోబరు 6న.. ఇండియన్ పీపుల్స్ ఫోరం ఆధ్వర్యంలో అక్టోబరు 5న సంబరాలు జరిపారు. గల్ఫ్ తెలంగాణ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అసోసియేషన్‌లో చందుర్తి మండలం నర్సింగాపూర్‌కు చెందిన జువ్వాడి శ్రీనివాస్‌రావు, మంథనికి చెందిన శ్రీనివాస్ శర్మ, జగిత్యాలకు చెందిన మెట్ట రమేశ్‌చంద్ర, సలావుద్దీన్, మేడిపల్లికి చెందిన దామెర సామ్యూల్ పండగ ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఎమిరేట్స్ తెలంగాణ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు పీచర కిరణ్‌కుమార్ బోయినిపల్లి మండలం వర్దవెల్లికి చెందిన వారు కాగా ప్రస్తుత అధ్యక్షుడు రాధారపు సత్యం సిరిసిల్ల వాస్తవ్యులు. ఇండియన్ పీపుల్స్ ఫోరంలో మేడిపల్లి మండలం తొంబర్రావుపేటకు చెందిన గంగారాం సభ్యుడిగా ఉన్నారు. దుబాయి సహా బహ్రెయిన్, కువైట్, ఒమన్, ఖతర్ తదితర గల్ఫ్ దేశాల్లోనూ పూల పండగను ఘనంగా నిర్వహిస్తున్నారు.


దుబాయిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

అంబరాన్నంటేలా..

అమెరికాలో గ్లోబల్ తెలంగాణ అసోసియేషన్ ఆధ్వర్యంలో అక్టోబరు 5న వైభవంగా పండగ జరిపారు. పెద్దపల్లికి చెందిన విశ్వేశ్వర్‌రెడ్డి కల్వల ఈ సంఘానికి అధ్యక్షుడిగా ఉన్నారు. న్యూవింగ్టన్‌లో ఈ నెల 6న తెలంగాణ ఎన్నారై అసోసియేషన్ ఆధ్వర్యంలో వేడుకలు జరగగా.. డల్లాస్, చికాగోలోనూ కార్యక్రమాలు నిర్వహించారు. న్యూజెర్సీలో తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం ఆధ్వర్యంలో 20వ సారి.. ఫ్లోరిడాలోని టాంపా నగరంలో తెలంగాణ అమెరికన్ తెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 6న వేడుకలు జరిగాయి. అమెరికాతోపాటు ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, సింగపూర్, మలేషియా, యూకే తదితర దేశాల్లో కొన్ని ప్రాంతాల్లో వేడుకలు పూర్తి కాగా మరి కొన్ని ప్రాంతాల్లో జరగనున్నాయి.


అమెరికాలో వేడుకలకు హాజరైన అతివలు

వేడుకలకు అతిథులు

దుబాయిలో జరిగిన వేడుకలకు మంత్రి జూపల్లి క్రిష్ణారావు, నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తదితరులు హాజరయ్యారు. సినీనటి అనన్య, జానపద గాయని వరం, బుల్లితెర హాస్యనటుడు సదన్న, భారత రాయబార కార్యాలయం నుంచి బిజేందర్ సింగ్ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అమెరికాలో వేడుకలకు మంత్రి జూపల్లి క్రిష్ణారావు హాజరయ్యారు. అమెరికా సహా వివిధ దేశాలకు తెలంగాణకు చెందిన పలువురు సినీనటులు, బుల్లితెర నటులు, వ్యాఖ్యాతలు, గాయనీ గాయకులు, సినీ ప్రముఖులు హాజరవుతూ బతుకమ్మ వేడుకలకు వన్నె తెస్తున్నారు.

ఊరిలో ఉన్నట్టుగానే ఉంది



ఈటీసీఏ ఆధ్వర్యంలో ఏటా బతుకమ్మ వేడుకలు నిర్వహిస్తున్నాం. మహిళా విభాగం ఈ వేడుకల నిర్వహణలో చురుకుగా పాల్గొంటోంది. ఈసారి వేడుకలకు 5 వేల మంది వరకు హాజరయ్యారు. ఇక్కడి వాతావరణం చూస్తుంటే మా గ్రామంలో ఉన్నట్లే అనిపిస్తోంది. ఆటపాటలతో మహిళలు, చిన్నారుల సందడి పండగకు వన్నె తెచ్చింది. ఏటా ఇలాగే కార్యక్రమాలు నిర్వహించాలని ఈటీసీఏ భావిస్తోంది. **- రాణి కోట్ల, దుబాయి**

ఆకట్టుకున్న పండగ



దుబాయిలో బతుకమ్మ వేడుకలు ఆకట్టుకున్నాయి. ఉద్యోగరీత్యా వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా కుటుంబ సభ్యులతో వేడుకల్లో పాల్గొన్నారు. దసరా ముందర ఈ పండగ అందరిలో హుషారు నింపింది. ఎడారి దీవుల పక్కన పూలతో చేసుకునే పండగ ఇక్కడి వారు కూడా ఆస్వాదించారు. రాష్ట్రం నుంచి వచ్చిన పలువురు వారి ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. **- మౌనిక గుండవేని, దుబాయి**


ఐరావతంపై నారసింహుడి ఊరేగింపు

ధర్మపురి, న్యూస్‌టుడే: పట్టణంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఐరావతం (ఏనుగు)పై ఉత్సవ మూర్తులను ఆసీనులను చేసి ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. అనంతరం దేవస్థానం నుంచి సేవను పుర వీధుల్లో స్వామివారి శోభాయాత్ర ఘనంగా ఊరేగించారు. ఈవో శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.



సొంతానికి ఎక్కువ.. ఆర్థికాభ్యున్నతికి తక్కువ

మహిళా రుణాల వినియోగం తీరిది ● నెరవేరని ప్రభుత్వ లక్ష్యం



న్యూస్‌టుడే, కరీంనగర్ సంక్షేమ విభాగం

మహిళలు ఆర్థికంగా ఎదగడానికి జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు బ్యాంకు లింకేజీతో రుణాలు అందజేస్తున్నారు. గతేడాది విధించిన లక్ష్యం చేరుకోవడంతో.. రాష్ట్రస్థాయిలో అవార్డు సైతం సొంతం చేసుకున్నారు. ప్రస్తుతం 2024-25 లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు. రుణాలు తీసుకున్న వారిలో అతికొద్ది మాత్రమే వ్యాపారానికి ఉపయోగించుకొని ఆర్థికాభ్యున్నతి పొందుతున్నారు. ఎక్కువ శాతం మంది సొంత అవసరాలకే వినియోగిస్తున్నారు. వారిలో అవగాహన పెంచాల్సిన ఆవశ్యకతపై 'న్యూస్‌టుడే' కథనం.

ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా స్వయం సహాయక సంఘాలకు ఏటా మంజూరు చేసిన రుణాన్ని.. సొంతానికి వినియోగించుకున్న అప్పులు చెల్లించడం, ఇతరత్రా వాటికే మహిళలు ఉపయోగించుకుంటున్నారు. సొంతంగా ఏదైనా స్వయం ఉపాధి ఏర్పాటు చేసుకొని ఆర్థికంగా ఎదిగేందుకు ఆలోచన చేయడంలేదు. అతి కొద్దిమంది మాత్రమే చిన్నపాటి వ్యాపారాలు చేస్తున్నారు. దీంతో మహిళలు పురోగతి సాధించాలనే ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మంజూరు చేసిన రుణమొత్తానికి ఆర్థికంగా ఎదిగేలా ప్రోత్సహిస్తే బాగుంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

జిల్లాల వారీగా ఈ ఆర్థిక సంవత్సరం వివరాలు

జిల్లా	సంఘాలు	రుణ లక్ష్యం (రూ.లక్షల్లో)
కరీంనగర్	11,083	77,125.34
రాజన్న సిరిసిల్ల	8,007	53,319.00
పెద్దపల్లి	9,101	47,796.95
జగిత్యాల	12,636	76,563.63

అవగాహన అవసరం

మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకొని వ్యాపారాలు చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం రుణాలు మంజూరు చేస్తోంది. వారందరూ రుణాలు తీసుకునేలా ఏటా లక్ష్యాన్ని విధిస్తోంది. అధికారులు ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా నాలుగు లక్షలకుపైగా సభ్యురాళ్లకు రుణాలు మంజూరు చేస్తే.. అందులో కనీసం వందల్లో కూడా ఆర్థికంగా రాణిస్తున్న వారు లేకపోవడం విశేషం. ప్రస్తుతం పలు సంఘాలు ఏటా రూ.3 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు రుణం తీసుకుంటున్నాయి.

ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం

మహిళలు ఆర్థికాభ్యున్నతి సాధించడానికి ప్రస్తుతం ఇందిరా మహిళా శక్తి ద్వారా సొంతంగా వ్యాపారాలు నిర్వహించేలా తగిన ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. వ్యాపారాలు ప్రారంభించి లాభాన్ని ఆర్జించేలా అధికారులు సూచనలు చేస్తూ పర్యవేక్షించేలా చూస్తాం.
- శ్రీధర్, కరీంనగర్ జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి

ఆధ్యాత్మిక పర్యాటకం.. అభివృద్ధికి అవకాశం

ఉమ్మడి జిల్లాలో సర్క్యూట్ ఏర్పాటుకు సన్నాహాలు

న్యూస్‌టుడే, ధర్మపురి

పర్యాటక, దేవాదాయశాఖల ఆధ్వర్యంలో రాష్ట్రంలో మూడు సర్క్యూట్లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. దీంతో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని వేములవాడ, కొండగట్టు, ధర్మపురి, కోటిలింగాల్లో ఆధ్యాత్మికతను వెదజల్లుతూనే.. పర్యాటకంగా భక్తులను ఆకర్షించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం అడుగులు వేస్తోంది. దీంతో ఈ కేంద్రాలు మరింత అభివృద్ధి చెందుతాయని భావిస్తున్నారు.


ధర్మపురి దేవస్థానం

● **చరిత్రాత్మక ఆలయాలు..**

☛ జగిత్యాల జిల్లాలోని చారిత్రక ప్రాధాన్యత కలిగి శాతవాహనుల రాజధానిగా వెలుగొందిన కోటిలింగాలలోని కోటి లింగేశ్వరస్వామి ఆలయం భక్తులను ఆకర్షిస్తోంది. తెలుగు రాష్ట్రాల్లోని తొమ్మిది నృసింహ క్షేత్రాల్లో ఒకటిగా పూజలందుకున్న ధర్మపురి క్షేత్రం.. భక్తుల కొంగు బంగారమైంది.

☛ జిల్లా సరిహద్దున గల రాయపట్నం వద్ద పురాతన, నూతన వారధుల ప్రదేశం, ఎల్లంపల్లి నిలువ నీటి ప్రదేశాలు భక్తులను ఆకర్షిస్తున్నాయి. ఇప్పటికే వెల్గటూర్ మండలంలోని కోటిలింగాల వద్ద ఏర్పాటుచేసిన బోటింగు పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటుంది.

☛ ప్రముఖ శైవ క్షేత్రాల్లో ఒకటిగా వెలుగొందుతున్న వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయం దక్షిణ కాశీగా చారిత్రాత్మక ప్రాధాన్యతను పొంది, భక్తులకు పెన్నిధిగా మారింది. లక్షలాది మంది హనుమాన్ భక్తులతో నిండిన కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయం విశేష ప్రాచుర్యాన్ని పొందింది.

● **ప్రణాళికల రూపకల్పన..**

గత నెలలో దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, ఆ శాఖ ప్రధాన కార్యదర్శి శైలజా రామయ్యర్, కమిషనర్ హన్మంతరావులతోపాటు, దేవస్థానాలకు చెందిన అధికారులు సమావేశమయ్యారు. ఆలయాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, మాస్టర్ ప్లాన్లు, భక్తులకు వీఐపీ దర్శన సౌకర్యాల కల్పనలపై సుదీర్ఘంగా చర్చించారు. దేవస్థానాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై, భక్తులకు వసతుల తోపాటు, ఆయా కేంద్రాల్లో పర్యాటకపరంగా తీర్చిదిద్దేలా ప్రణాళికలను రూపొందిస్తున్నారు. ఈ కేంద్రాల్లో ఓ వైపు పర్యాటకపరంగా ఏఏ పనులు ఇంతకుముందు ప్రతిపాదించారు? ఇంకా ఏ పనులు చేపట్టాల్సి ఉంది? నిధులు ఎన్ని అవసరమవుతాయనే విషయంపై చర్చించనున్నారు.

☛ ఇంతటి ప్రాధాన్యతలు, విశేషాలు ఉన్న ప్రధాన ఆధ్యాత్మిక కేంద్రాలను కలిపి మొదటి సర్క్యూట్‌గా ఏర్పాటుచేసి, పర్యాటక, దేవాలయాల పరంగా అభివృద్ధి పరచే లక్ష్యంతో ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

ఎస్సారెస్పీకి 34 వేల క్యూసెక్కుల వరద

జగిత్యాల ధరూర్‌క్యాంపు, న్యూస్‌టుడే: శ్రీరామ సాగర్ ప్రాజెక్టులోకి మంగళవారం సాయంత్రం వరకు 34,086 క్యూసెక్కుల వరదనీరు వస్తుండగా 4 స్పిల్‌వే గేట్ల ద్వారా 12,496 క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా 1,200 క్యూసెక్కులు, మిగులు జలాలను గోదావరిలోకి విడుదల చేస్తున్నారు. వరద కాలువకు 12 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తూ మధ్యమానేరు జలాశయానికి తరలిస్తున్నారు. కాకతీయ కాలువ, విద్యుత్తు ఉత్పత్తికి 6,800, లక్ష్మీ కాలువకు 150, సరస్వతి కాలువకు 500, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టులో గరిష్ఠ స్థాయిలో 80.501 టీఎంసీల నీటినిల్వ, 1091.0 అడుగుల నీటిమట్టం ఉంది.

బడితండా వాసికి బంగారు పతకం


పతకంతో అనిల్

రుద్రంగి, న్యూస్‌టుడే: గోవాలో ఈ నెల 6 నుంచి 8 వరకు నిర్వహించిన ఆల్ ఇండియా యూత్ గేమ్స్ 800 మీటర్ల పరుగు పోటీలో రుద్రంగి మండలం బడితండాకు చెందిన మాలోత్ అనిల్ ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించాడు. ఇటీవల జాతీయ స్థాయి ట్రెక్కింగ్ పోటీలకు కూడా అనిల్ ఎంపికయ్యాడు. ప్రస్తుతం అనిల్ కరీంనగర్‌లోని ఎస్ఆర్ఆర్ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాలలో బీకాం రెండో సంవత్సరం చదువుతున్నాడు. వివిధ క్రీడల్లో రాణిస్తున్న యువకుడిని మండలానికి చెందిన పలువురు అభినందించారు.

హత్యాయత్నం కేసులో రెండేళ్ల జైలు

జగిత్యాల, న్యూస్‌టుడే: హత్యాయత్నం కేసులో ఒకరికి జగిత్యాల న్యాయస్థానం రెండేళ్ల జైలు శిక్ష విధించింది. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. బుగ్గారం మండలం గోపులాపూర్‌లో రొండి మాణిక్యం అలియాస్ సంతోశ్.. తన అన్న రొండి రవీందర్ మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. రవీందర్ భార్య సుజాత మంత్రాలు చేయడం వల్లే తన భార్యాపిల్లల ఆరోగ్యం దెబ్బతింటుందని భావించి మాణిక్యం కోపం పెంచుకున్నాడు. 2018 ఫిబ్రవరి 21న కొబ్బరిబోండాలు కొట్టే కత్తితో రవీందర్ ఇంట్లోకి చొరబడిన మాణిక్యం.. తన వదిన సుజాతపై దాడి చేసి పారిపోయాడు. తీవ్రంగా గాయపడిన ఆమెను జగిత్యాల ఆసుపత్రికి తరలించారు. బుగ్గారం పోలీసులు కేసు నమోదు చేసి మాణిక్యంను రిమాండ్‌కు పంపించగా ఎస్సైలు మధూకర్, రవీందర్‌లు కేసు దర్యాప్తు చేశారు. కోర్టు విధుల అధికారులు రాజునాయక్, శ్రీధర్, కిరణ్‌లు సాక్ష్యాధారాలు అందించగా ప్రాసిక్యూషన్ తరఫున అదనపు పీపీ సాయిల్ల మురళి వాదించారు. నేరం రుజువు కావడంతో నిందితుడికి అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కె.ప్రసాద్.. నిందితుడికి రెండేళ్ల జైలు శిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పు చెప్పారు. శిక్ష పడటానికి చొరవ చూపిన అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ అభినందించారు.




మేయర్‌పై అట్రాసిటీ కేసు నమోదు

కరీంనగర్ నేరవార్తలు, న్యూస్‌టుడే: కరీంనగర్ నగర పాలక సంస్థ మేయర్ వై.సునీల్‌రావుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ సీఐ విజయ్‌కుమార్ తెలిపారు. 44వ డివిజన్ కార్పొరేటర్ మెండి శ్రీలత ఫిర్యాదు ఆధారంగా కోర్టు ఆదేశాలతో పోలీసులు ఈ కేసును నమోదు చేశారు. తన డివిజన్‌లో జరగాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించి నిధులు కేటాయించాలని గతంలో మేయర్‌ను క్యాంపు కార్యాలయంలో కలిసి విన్నవించానని.. ఆ సమయంలో కులం పేరుతో దూషించారని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. డివిజన్‌కు దురుద్దేశపూర్వకంగానే నిధులు ఇవ్వడంలేదని రెండు సార్లు పోలీసుస్టేషన్‌లో కార్పొరేటర్ ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేయడంలో జాప్యం చేస్తున్నారని కోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో వాస్తవాలని ధ్రువీకరించేందుకు పోలీసులు త్వరలో విచారణ చేపట్టనున్నారు.

గొలుసు చోరీ నిందితుల అరెస్టు

తెలంగాణచౌక్ (కరీంనగర్): గొలుసు దొంగతనాలకు (చైన్‌స్నాచింగ్) పాల్పడుతున్న నిందితులను పట్టుకున్నామని రూరల్ ఏసీపీ వెంకటరమణ తెలిపారు. ఏసీపీ తెలిపిన ప్రకారం.. ఎడవెల్లి దీపక్, చందు అనే యువకులు జల్సాలకు అలవాటుపడ్డారు. కరీంనగర్‌లోని పలు శివారు ప్రాంతాల్లో ఒంటరిగా నడిచి వెళ్లే మహిళలను లక్ష్యంగా చేసుకొని ద్విచక్రవాహనంపై వచ్చి బంగారు గొలుసులు చోరీ చేసేవారు. మంగళవారం తీగలగుట్టపల్లిలో పోలీసులు తనిఖీ చేస్తున్నారు. పోలీసులను చూసి పారిపోతుండగా వారిని పట్టుకున్నారు. నిందితుల నుంచి బంగారాన్ని కొన్న షాప్ యజమాని సింహరాజు నరేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 105.85 గ్రాముల బంగారం రికవరీ చేశారు. స్కూటీతోపాటు బుల్లెట్ వాహనాన్ని స్వాధీనం చేసుకొని, నిందితులపై కేసు నమోదు చేశారు. నిందితులను పట్టుకోవడంలో కృషి చేసిన సీఐ ప్రదీప్‌కుమార్, ఎస్సై ఎ.లక్ష్మారెడ్డి, పోలీసు సిబ్బందిని ఏసీపీ అభినందించారు.




కాజీపేట నుంచి దాదర్‌కు రెండు ప్రత్యేక రైళ్లు




పెద్దపల్లి, న్యూస్‌టుడే: కాజీపేట, దాదర్ మధ్య నవంబరు నుంచి రెండు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు. మొదటి రైలు కాజీపేట నుంచి నవంబరు 27 నుంచి జనవరి 29 వరకు ప్రతి బుధవారం నడుస్తుంది. తిరిగి ఇదే రైలు దాదర్ నుంచి నవంబర్ 28 నుంచి జనవరి 30 వరకు ప్రతి గురువారం బయల్దేరుతుంది. రెండో ప్రత్యేక రైలు నవంబర్ 30 నుంచి జనవరి 25 వరకు ప్రతి శనివారం కాజీపేట నుంచి దాదర్‌కు, డిసెంబర్ 1 నుంచి జనవరి 26 వరకు ప్రతి ఆదివారం దాదర్ నుంచి నడుస్తుంది. రెండు రైళ్లు ఉమ్మడి జిల్లాలోని జమ్మికుంట, పెద్దపల్లి, కరీంనగర్, లింగంపల్లి(జగిత్యాల), కోరుట్ల, మెట్‌పల్లి స్టేషన్లలో ఆగుతాయి. ఇక్కడి నుంచి బాసర వెళ్లే భక్తులకు ఈ రైళ్లు అనుకూలంగా ఉంటాయి.

మద్దతు ధరపైనే ఆశలు



పత్తి కొనుగోళ్లు ప్రారంభించిన వ్యాపారులు

ఉమ్మడి జిల్లాలో సీజన్‌కు ముందు నుంచే కొత్తపత్తి కొనుగోళ్లు మొదలయ్యాయి. పాత పత్తి విక్రయాలు తగ్గిపోగా.. క్రమేణా కొత్తపత్తి విక్రయాలు పెరుగుతున్నాయి. గత నెల 13 నుంచి జమ్మికుంట ప్రధాన వ్యవసాయ మార్కెట్‌కు కొత్తపత్తిని రైతులు విక్రయానికి తీసుకొస్తున్నారు. వరంగల్, కేసముద్రం, ఖమ్మం మార్కెట్లలోనూ కొత్తపత్తి విక్రయాలు ప్రారంభమయ్యాయి. **- న్యూస్‌టుడే, జమ్మికుంట**


జమ్మికుంట మార్కెట్ యార్డులో ఆరబెట్టిన కొత్తపత్తి

క్వింటాకు రూ.7,521

■ కేంద్ర ప్రభుత్వం క్వింటా పత్తికి రూ.7,521 మద్దతు ధర ప్రకటించింది. ఇది ఈ నెల 1 నుంచి అమలులోకి రానుంది.

■ పింజ పొడవును బట్టి మధ్యస్థ పత్తికి రూ.7,121గా నిర్ణయించింది.

■ వరంగల్ రీజియన్ మార్కెటింగ్ పరిధిలో నాలుగు వ్యవసాయ మార్కెట్లకు కొత్తపత్తిని రైతులు విక్రయానికి తీసుకొస్తున్నారు.

■ జమ్మికుంటలో కొనుగోళ్ల మొదటి రోజు రూ.7,119ల ధర పలికింది.

■ మార్కెట్‌లో సుమారు 17 రోజుల్లో సుమారు 800 క్వింటాళ్ల కొత్త పత్తి కొనుగోళ్లు జరిగాయి.

■ కొత్తపత్తి విక్రయాలు దసరా అనంతరం జోరు అందుకోనున్నాయి.

■ రానున్న రోజుల్లో ఎక్కువ మొత్తంలో పత్తి విక్రయానికి వచ్చే అవకాశం ఉన్నందున మద్దతు ధర కోల్పోకుండా సీసీఐ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడంపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు.

■ ప్రస్తుతం కొత్తపత్తితోపాటు నామమాత్రంగా వస్తున్న పాతపత్తిని ద్వితీయ శ్రేణి వ్యాపారులే ఖరీదు చేస్తున్నారు. అధిక తేమ శాతం, నాణ్యత లేని పత్తిని ఖరీదు చేసి యార్డులో, గిడ్డంగులు, షాపుల వద్ద ఆరబెడుతున్నారు.

■ మహారాష్ట్ర, ఇతర ప్రాంతాల్లో విక్రయించేందుకు వీలుగా తేమశాతం ఎక్కువ ఉన్న పత్తిని ఆరబెట్టడంపై ద్వితీయశ్రేణి వ్యాపారులు దృష్టి సారించారు.

■ ప్రస్తుతం జిన్నింగ్ మిల్లుల్లో యంత్రాల మరమ్మతు పనులు చేపట్టామని.. దసరా తర్వాతే మిల్లుల్లో కొత్తసీజన్‌లో కొనుగోళ్లు చేపడతామని మిల్లుల వ్యాపారులు చెబుతున్నారు.

తేమ లేకుండా చూడాలి



జమ్మికుంట మార్కెట్‌లో కొత్తపత్తి విక్రయాలు క్రమేణా పెరిగాయి. పత్తి ఏరగానే నేరుగా విక్రయానికి తీసుకొస్తున్నారు. దీంతో తేమ శాతం ఎక్కువ ఉంటోంది. ఈ కారణంగా ధర తగ్గుతుంది. రైతులు పత్తిని ఆరబెట్టి పెట్టి విక్రయానికి తీసుకురావాలి. సీసీఐ కొనుగోలు కేంద్రాల ఏర్పాటు నిబంధనలు ఇంకా అధికారుల నుంచి రాలేదు.
- ఆర్.మల్లేశం, కార్యదర్శి, వ్యవసాయ మార్కెట్, జమ్మికుంట

మార్కెట్‌కు నాలుగు రోజులు సెలవు

జమ్మికుంట, న్యూస్‌టుడే: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌కు నాలుగు రోజులు సెలవు ప్రకటించామని ఉన్నతశ్రేణి కార్యదర్శి మల్లేశం తెలిపారు. పండగల అనంతరం సోమవారం మార్కెట్ నిర్వహణ ఉంటుందని రైతులు, వ్యాపారులు, కార్మికులు గమనించాలని ఆయన కోరారు.

తగ్గిన విక్రయాలు

మంగళవారం మార్కెట్‌లో కొత్తపత్తి విక్రయాలు తగ్గాయి. యార్డుకు 45 ట్రాలీల విడి పత్తి రాగా.. బిడ్డింగ్‌లో క్వింటాకు కనిష్ఠంగా రూ.6,000 గరిష్ఠంగా రూ.6,650 ధర పలికింది. 65 క్వింటాళ్ల బస్తాల పత్తిని రూ.5,900-6,500 దాకా వ్యాపారులు ఖరీదు చేశారు. పాత పత్తి విక్రయానికి రాలేదని మార్కెట్ అధికారులు తెలిపారు. సోమవారం కంటే తాజాగా పత్తి ధర రూ.150 తగ్గింది. తేమ అధికంగా ఉండటం, నాణ్యత లేకపోవటంతో ధర తగ్గిందని వ్యాపారులు అంటున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 4 PM)
గోదావరిఖని : 80085 73573
పెద్దపల్లి : 80085 73542
మంథని : 99122 68471

న్యూస్‌టుడే, ముత్తారం

? ముత్తారం మండలం అడవిశ్రీరాంపూర్ క్రాస్ రోడ్డు వద్ద హైమాస్ట్ లైట్లు పగటి పూట కూడా వెలుగుతున్నాయి. **-అనిల్, గ్రామస్థుడు**

✔ హైమాస్ట్ లైట్లు ఎక్కువ ఎత్తులో ఉండటంతో, దానికి ఆనుకొని ఉన్న చెట్ల కొమ్మలు తగిలి షార్టుసర్క్యూట్ అవుతోంది. ఎల్‌సీ తీసుకొని సమస్యను పరిష్కరిస్తాం. **-నరేశ్, పంచాయతీ కార్యదర్శి**

న్యూస్‌టుడే, పాలకుర్తి

సమస్య: పాలకుర్తి మండలం కన్నాల రజీవ్‌కాలనీలో విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుంది. **- కాలనీవాసులు**

సమాధానం: సమస్యను పరిష్కరిస్తాం.
- వంశీకృష్ణ, ట్రాన్స్‌కో ఏఈ బసంత్‌నగర్

ఇళ్ల నిర్మాణం త్వరగా పూర్తిచేయండి

గోదావరిఖని, న్యూస్‌టుడే: జంగాలపల్లి సమీపంలో నిర్మించిన రెండు పడక గదుల ఇళ్లను జిల్లా కలెక్టర్ శ్రీహర్ష మంగళవారం పరిశీలించారు. వెంటనే పనులను పూర్తిచేసి లబ్ధిదారులకు కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. మొత్తం 670 రెండు పడకల నిర్మాణానికి ప్రస్తుతం 570 ఇళ్లు పూర్తిచేసి రంగులు అద్దారని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. మరో 56 ఇళ్లకు సిమెంటు పూత పనులు సాగుతున్నాయన్నారు. అదనపు కలెక్టర్ అరుణశ్రీ, అధికారులు పాల్గొన్నారు.

ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి చర్యలు

మంథని, న్యూస్‌టుడే: 'డయల్ యువర్ డీఎం' కార్యక్రమంలో తమ దృష్టికి వచ్చిన ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని డీఎం శ్రీనాథ్ తెలిపారు. కార్యక్రమంలో భాగంగా మంగళవారం 11 కాల్స్ వచ్చాయని చెప్పారు. జమ్మికుంట-బోర్లగూడెం మార్గంలో బస్సులు నడపాలని ప్రయాణికులు కోరారని, డిపోకు కొత్త బస్సులు రాగానే నడుపుతామన్నారు. కరీంనగర్ నుంచి మంథనికి రాత్రి 9 గంటల తర్వాత బస్సులు నడపాలని కోరారని, ఈ మేరకు చర్యలు తీసుకుంటామన్నారు. కొత్త బస్సులు వచ్చిన తర్వాత తాడిచెర్లకు అదనంగా మరో రెండు నడుపుతామన్నారు.

నియోజకవర్గ అభివృద్ధిలో విఫలం

పెద్దపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే: నియోజకవర్గ అభివృద్ధిలో పెద్దపల్లి ఎమ్మెల్యే విఫలమయ్యారని భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సురేశ్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సమీకృత గురుకులాల నిర్మాణానికి ఎంపిక చేసిన జాబితాలో పెద్దపల్లి నియోజకవర్గం లేకపోవడం బాధాకరమన్నారు. గురుకులాలు రాకుండా అడ్డుకున్న గత ఎమ్మెల్యే విధానాన్నే ప్రస్తుత ఎమ్మెల్యే కొనసాగిస్తున్నారని ఆరోపించారు. సీఎంకు సన్నిహితుడిగా చెప్పుకొనే ఎమ్మెల్యే అభివృద్ధికి నిధులు ఎందుకు తీసుకురావడం లేదో చెప్పాలని ప్రశ్నించారు.

జేఎన్టీయూలో ఆయుధపూజ

కమాన్‌పూర్(సెంటినరీకాలనీ): జేఎన్టీయూ కళాశాలలో మంగళవారం ఆయుధపూజ నిర్వహించారు. ఏటా దసరా సెలవులకు ముందు ఈ వేడుక నిర్వహిస్తారు. వేద మంత్రోచ్చారణల మధ్య సరస్వతీ మాత విగ్రహానికి ప్రిన్సిపల్ శ్రీధర్‌రెడ్డి వెండి కిరీటాన్ని అలంకరించారు. అన్ని విభాగాల్లో అర్చకులు పూజలు చేశారు. డీఈఈ సతీశ్, కార్యాలయ సూపరింటెండెంట్ రవికుమార్, గ్రంథాలయ ఇన్‌ఛార్జి రమణ, పరిపాలనాధికారి సుమన్ పాల్గొన్నారు.

18 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

పెద్దపల్లి, న్యూస్‌టుడే: పెద్దపల్లి పట్టణంలోని సర్వీస్ స్టాండ్ ప్రాంతంలో కిరాణా దుకాణం నిర్వహిస్తున్న భైరి లక్ష్మణ్ వద్ద 18 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని మంగళవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై రాజేశ్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. బియ్యంతో పాటు నిందితుడిని స్థానిక పోలీసులకు అప్పగించారు.

నేర వార్తలు

దాడి చేసి ఆభరణాలు అపహరించి..

జ్యోతినగర్(మార్కండేయకాలనీ): ఎన్టీపీసీ పీకేరామయ్యకాలనీకి చెందిన వృద్ధురాలు నిర్మలకు.. అదే కాలనీకి చెందిన అశ్విని పని చూపిస్తానని మాయమాటలు చెప్పి నమ్మించారు. అనంతరం సోమవారం చెట్ల పొదలకు తీసుకెళ్లి ఇష్టానుసారంగా గాయపరిచి వృద్ధురాలి నుంచి 2 తులాల బంగారు ఆభరణాలు, వెండి కాళ్ల కడాలు లాక్కున్నారు. మంగళవారం అశ్వినిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎన్టీపీసీ ఎస్సై సతీశ్ తెలిపారు.

చోరీకి యత్నించిన మహిళలకు దేహశుద్ధి

సుల్తానాబాద్, న్యూస్‌టుడే: చోరీకి యత్నించిన మహిళలకు గ్రామస్థులు దేహశుద్ధి చేసిన ఘటన సుల్తానాబాద్ మండలం గర్రెపల్లిలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామస్థుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన ఆది రంగారావు కరీంనగర్‌లో స్థిరపడ్డారు. మంగళవారం ప్లాస్టిక్ సామగ్రి అమ్మడానికి వచ్చిన నలుగురు మహిళలు ఇంటి తాళం పగులకొట్టి లోపలికి చొరబడ్డారు. సుమారు రూ.25 వేల విలువైన సామగ్రి చోరీకి యత్నించగా పొరుగు వారు గమనించారు. గ్రామస్థులు మహిళలకు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. పోలీసులు వారిని రిమాండుకు తరలించారు.

12 తులాల బంగారం చోరీ

గోదావరిఖని: మాజీ ఎమ్మెల్యే మాలెం మల్లేశ్ తనయుడు కిరణ్ ఇంట్లో సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. గోదావరిఖని ఒకటో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక మార్కండేయకాలనీలో నివాసముండే కిరణ్ కుటుంబసభ్యులు సోమవారం ఉదయం హైదరాబాద్‌కు వెళ్లారు. తిరిగి రాత్రి 1.30 గంటలకు ఇంటికి చేరుకుని చూసేసరికి.. 12 తులాల బంగారు ఆభరణాలు, 15 తులాల వెండి ఆభరణాలతోపాటు రూ.50 వేల నగదు చోరీకి గురయ్యాయి. కేసు నమోదు చేసుకున్న సీఐ రవీందర్ విచారణ చేపడుతున్నారు.


రామగుండం భాజపా ఇన్‌ఛార్జి సంధ్యారాణి దంపతులు


ఖని: మేకల మార్కెట్ రోడ్డులో..


బతుకమ్మ సంబరాల్లో ఎమ్మెల్యే, మేయర్, అదనపు కలెక్టర్

దుర్గమ్మకు పూజలు.. బతుకమ్మ ఆటలు


మంథని మండలం చిల్లపల్లిలో మహాలక్ష్మి అవతారంలో దుర్గాదేవి

దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం జిల్లావ్యాప్తంగా దుర్గాదేవి మండపాల్లో వైభవంగా పూజలు నిర్వహించారు. పెద్దపల్లిలోని బ్రాహ్మణ సంఘం దుర్గాదేవి మండపాన్ని అదనపు కలెక్టర్, ఆర్డీవో గంగయ్య సందర్శించి పూజలు చేశారు. మండపాల్లో అన్నదానాలు, కుంకుమార్చనలు నిర్వహించారు. బతుకమ్మ వేడుకల్లో ఏడో రోజు ఊరూరా మహిళలు ఆడిపాడారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగినులు, సిబ్బంది ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. **-న్యూస్‌టుడే బృందం**


పెద్దపల్లి పురపాలికలో బతుకమ్మ వేడుకలు


ఓదెల దుర్గాదేవి మండపంలో కుంకుమ పూజలు


సుల్తానాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో..


తుర్కలమద్దికుంటలో కుంకుమ పూజలు


కమాన్‌పూర్‌లో బతుకమ్మ ఆడుతున్న ఉద్యోగినులు


బతుకమ్మలతో సింగరేణి అధికారుల కుటుంబాలు

పెద్దపల్లి చరిత్రపై చలన చిత్రం

పెద్దపల్లి, న్యూస్‌టుడే: పెద్దపల్లి ప్రాంత చారిత్రక నేపథ్యంపై త్వరలోనే సినిమా తీయనున్నట్లు దర్శకుడు శ్రీకాంత్ ఓదెల తెలిపారు. పెద్దపల్లి మండలం చీకురాయికి చెందిన శ్రీకాంత్ కుటుంబం గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతంలో స్థిరపడింది. మంగళవారం గ్రామంలో దుర్గామాత పూజా కార్యక్రమానికి శ్రీకాంత్ కుటుంబ సమేతంగా హాజరయ్యారు. గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతంలో జరిగిన కొన్ని సంఘటనల ఆధారంగానే దసరా సినిమాను రూపొందించానన్నారు. ప్రస్తుతం తాను తీస్తున్న యాక్షన్ సినిమా అనంతరం పెద్దపల్లి ప్రాంతానికి సంబంధించిన సినిమాను ఇక్కడే చిత్రీకరించనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ మాజీ సభ్యుడు రామూర్తి దంపతులు శ్రీకాంత్ దంపతులను సన్మానించారు.


శ్రీకాంత్ దంపతులను సన్మానిస్తున్న రామూర్తి, త్రివేణి దంపతులు

వ్యాపారి నేత్రాలు సజీవం


శ్యామ్‌సుందర్‌శర్మ

గోదావరిఖని పట్టణం: అనారోగ్యంతో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందిన గోదావరిఖనిలోని ఓ వ్యాపారి శ్యామ్‌సుందర్‌శర్మ నేత్రాలను సదాశయ ఫౌండేషన్, రామగుండం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సేకరించి హైదరాబాదులోని కంటి ఆసుపత్రికి పంపించారు.

రైల్వే సమస్యలపై అధికారులకు వినతి

పెద్దపల్లి, న్యూస్‌టుడే: పెద్దపల్లి లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని రైల్వే సమస్యలు, అభివృద్ధి అంశాలు, పాత రైళ్ల పునరుద్ధరణ, కొత్త రైళ్ల హాల్టింగులపై మంగళవారం దక్షిణ మధ్య రైల్వే అధికారులను ఎంపీ వంశీకృష్ణ, చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామిలు రైల్వే అధికారులను కోరారు. సికింద్రాబాద్‌లోని రైల్వే కార్యాలయంలో ప్రిన్సిపల్ చీఫ్ ఆపరేషన్ మేనేజర్ నాగ్యా, జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్‌లను వారు కలిశారు.


రైల్వే అధికారులతో మాట్లాడుతున్న ఎంపీ, ఎమ్మెల్యేలు

రైతు కుమారుడికి సింగరేణిలో మొదటి ర్యాంకు

దహెగాం, న్యూస్‌టుడే : కుమురంభీం జిల్లా దహెగాం మండలంలోని ఖర్జీ గ్రామానికి చెందిన వ్యవసాయ కుటుంబమైన రుషి-శారద దంపతుల కుమారుడు లంగారి ప్రసాద్.. సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్సీసీఎల్) పరీక్ష ఫలితాల్లో మెరిశారు. ఆగస్టు 7న పరీక్షలు నిర్వహించగా మంగళవారం ఫలితాలు వెలువడ్డాయి. అసిస్టెంట్ ఫోర్‌మెన్ ట్రైనీలో ప్రసాద్ రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచారు.

నేడు కుటుంబ దినోత్సవం

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి ఆర్జీ-2 డివిజన్‌లో బుధవారం బతుకమ్మ వేడుకలు, కుటుంబ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు అధికార ప్రతినిధి అనిల్‌కుమార్ తెలిపారు. కాలనీలోని సీఈఆర్ క్లబ్ ఆవరణలో సాయంత్రం 6గంటలకు నిర్వహించే ఈ వేడుకలో కార్మికులు, వారి కుటుంబసభ్యులు పాల్గొనాలని కోరారు. ఉత్తమ బతుకమ్మకు బహుమతులు ఇవ్వనున్నామని.. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మహిళలు బతుకమ్మలతో రావాలన్నారు.



కంపెనీ స్థాయి పోటీలు ప్రారంభం

యైటింక్లయిన్‌కాలనీ, న్యూస్‌టుడే: సింగరేణి స్థాయి షటిల్, టేబుల్ టెన్నిస్ క్రీడా పోటీలు మంగళవారం లాంఛనంగా ప్రారంభమయ్యాయి. కాలనీలోని సీఈఆర్ క్లబ్ ఆవరణలో నిర్వహించిన వీటిని జీఎం సూర్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. రెండు రోజులపాటు నిర్వహించే ఈ పోటీలకు సంస్థలోని 11 ఏరియాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారని.. ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను కోల్ఇండియా స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు.


క్రీడాపతాకాన్ని ఎగురవేస్తున్న జీఎం

అభ్యర్థులకు నియామక పత్రాలు

కమాన్‌పూర్(సెంటినరీకాలనీ): అడ్రియాల ప్రాజెక్టు ఏరియాలోని ఎంవీటీసీలో 48 రోజుల శిక్షణ పూర్తయిన నలుగురు డిపెండెంట్ల(కారుణ్య నియామకాల ద్వారా వచ్చిన వారసుల)కు మంగళవారం జీఎం వెంకటేశ్వర్లు నియామక పత్రాలు అందజేశారు. గుర్తింపు సంఘం నాయకుడు రామచంద్రారెడ్డి, ఎస్వోటూ జీఎం సత్యనారాయణ, ప్రాజెక్టు అధికారి నాగేశ్వరరావు, పర్సనల్ విభాగాధిపతి సుదర్శనం, డీపీఎం శ్రీహరి, జూనియర్ అసిస్టెంట్ క్రాంతికిరణ్ పాల్గొన్నారు.

కొత్త గనులతోనే సంస్థకు భవిష్యత్తు

గోదావరిఖని, న్యూస్‌టుడే: కొత్త గనులతో సింగరేణికి భవిష్యత్తు ఉంటుందని ఏఐటీయూసీ నాయకులు రాజ్‌కుమార్ అన్నారు. వాటికోసం గుర్తింపు సంఘం పోరాటం చేస్తుందన్నారు. ఆర్జీ-1 సీఎస్పీ-1లో మంగళవారం ద్వార సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న 15 ఏళ్లలో ప్రస్తుతం నడుస్తున్న గనులు మూసివేత దశకు చేరుకుంటాయన్నారు. వాటి స్థానంలో కొత్త గనులు ఏర్పాటు చేయకుంటే భవిష్యత్తు ఉండదన్నారు. నాయకులు పాల్గొన్నారు.

ఆర్జీ-3 జీఎం కార్యాలయంలో బతుకమ్మ సంబరాలు

కమాన్‌పూర్(సెంటినరీకాలనీ), న్యూస్‌టుడే: ఆర్జీ-3, ఏపీఏ ఏరియాల జీఎం కార్యాలయ ఆవరణలో మంగళవారం బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. వివిధ విభాగాల అధికారిణులు, ఉద్యోగినులు, కాంట్రాక్టు ఉద్యోగినులు ఉత్సాహంగా ఆడిపాడారు. సద్దుల బతుకమ్మను పురస్కరించుకొని సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 10న సాయంత్రం 6 గంటలకు స్థానిక రుద్రమదేవి క్రీడా మైదానంలో ఫ్యామిలీ డే వేడుకలు నిర్వహించనున్నట్లు జీఎం సుధాకరరావు తెలిపారు. ఎస్వోటూ జీఎం రఘుపతి, పర్సనల్ విభాగాధిపతి సుదర్శనం, సీనియర్ ఎస్టేట్స్ అధికారి ఐలయ్య, డీపీఎం గుర్రం శ్రీహరి పాల్గొన్నారు.


కార్యాలయ ఆవరణలో బతుకమ్మ ఆడుతున్న ఉద్యోగినులు

రహదారికి తాత్కాలిక మరమ్మతు

ఈనాడు స్పందనకు వందనం

సుల్తానాబాద్, న్యూస్‌టుడే: ఇటీవలి వర్షాలకు సుల్తానాబాద్ మండలం నీరుకుల్ల నుంచి కరీంనగర్ జిల్లా మానకొండూర్‌కు వెళ్లే రహదారి కోతకు గురై ప్రమాదకరంగా మారింది. ఈ సమస్యపై 'రూ.కోటి నిధులు.. కొట్టుకుపోయాయి' శీర్షికన సెప్టెంబరు 30న 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మంగళవారం పంచాయతీ నిధులు రూ.20 వేలు వెచ్చించి తాత్కాలిక మరమ్మతు కోసం మట్టిని పోశారు.


రహదారి మరమ్మతుకు పోసిన మట్టి

మహిళల రక్షణ చట్టాలపై అవగాహన

కమాన్‌పూర్, న్యూస్‌టుడే: మహిళల రక్షణ కోసం అనేక చట్టాలున్నాయని జిల్లా మహిళా సాధికారిత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ స్వప్న, ఫైనాన్స్ లిట్రసీ సంధ్యారాణి అన్నారు. కమాన్‌పూర్ మండలం పెంచికల్‌పేట లక్ష్మి గ్రామైక్య సంఘం సభ్యులకు మంగళవారం రక్షణ చట్టాలు, సఖి కేంద్రం, చైల్డ్ హెల్ప్ లైన్, భరోసా, షీటీం, కేంద్ర, రాష్ట్ర పథకాలపై అవగాహన కల్పించారు. వీవోఏ సంధ్యారాణి, కార్యదర్శి వసంతి, కోశాధికారి వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ

కమాన్‌పూర్ (సెంటినరీకాలనీ): కమాన్‌పూర్, రామగిరి, పాలకుర్తి మండలాల్లోని సీఎం సహాయనిధి, కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు మంగళవారం మంత్రి శ్రీధర్‌బాబు వ్యక్తిగత సహాయకుడు చంద్రశేఖర్ చెక్కులు అందజేశారు. మూడు మండలాలకు చెందిన 132 మంది లబ్ధిదారుల ఇళ్ల వద్ద అందజేశారు.

హెచ్చరిక మరియు బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా, నా క్లయింట్లు అగు శ్రీ కక్కిరాల రమేశ్, తండ్రి: పుల్లయ్య మరియు శ్రీమతి కక్కిరాల సుజన, భర్త: రమేశ్, నివాసం: కరీంనగర్ గారలు ఈ క్రింది షెడ్యూల్ స్థిరాస్తిని **"అక్షర టౌన్‌షిప్స్ ప్రై. లి.,"** హన్మకొండ అను దాని చైర్మన్ శ్రీ శ్రీనివాసరావు పేరాల, తండ్రి: భీంరావు గార్లకి విక్రయించి వారి పేరున రిజిష్టర్ విక్రయ దస్తావేజు నెం. 1109/2018, తేది: 20-02-2018 వ్రాయించి ఇచ్చినారు.

పై కొనుగోలుదార్లు కొంత విక్రయ ధనమును చెల్లించి మిగతా విక్రయ ధనమునకు పోస్టు డేటెడ్ చెక్కులు ఇచ్చినారు. కాని అట్టి చెక్కులకు చెల్లింపులు చేయనందున, నా క్లయింట్లు గౌరవ సీనియర్ సివిల్ జడ్జి, కరీంనగర్ గారి కోర్టులో దావా నెం. ఓ.యస్. 24/2020 గల దానిని **అక్షర టౌన్‌షిప్ ప్రై. లి.** యొక్క చైర్మన్ మరియు డైరెక్టర్లు 1) శ్రీ పేరాల శ్రీనివాస్‌రావు, తండ్రి: భీంరావు, ఇ.నెం.1-7-1385, గ్రౌండ్‌ఫ్లోర్, అడ్వకేట్ కాలనీ, హన్మకొండ, వరంగల్ జిల్లా, 2) శ్రీ రాజేందర్ పుప్పాల, తండ్రి: చంద్రయ్య, నివాసం: ఇ.నెం. 25-7-26, విష్ణుపురి, కాజీపేట జంక్షన్, హన్మకొండ, వరంగల్ జిల్లా, 3) శ్రీ కొండల్‌రావు సూరినేని, తండ్రి: రాజేశ్వర్‌రావు, నివాసం: ఇ.నెం. 1-99, మొగుల్లపల్లి గ్రామం, పర్కాల్ మండలం, వరంగల్ జిల్లా., 4) శ్రీమతి శ్రీవిద్య పేరాల, భర్త: శ్రీనివాస్‌రావు, నివాసం: ఇ.నెం. 2-10-765, ఎస్.బి.హెచ్. కాలనీ, వడ్డేపల్లి ఎక్స్‌రోడ్, సుబేదారి, వడ్డేపల్లి రూరల్, హన్మకొండ లొకాలిటి, వరంగల్ జిల్లా గార్లపై దాఖలు చేయగా గౌరవ కోర్టు వారు ఈ క్రింది స్థిరాస్థికి అటాచ్‌మెంట్ ఉత్తర్వులను జారీ చేసినారు.

కావున పై కొనుగోలుదారు అయిన **అక్షర టౌన్‌షిప్స్ ప్రై. లి.** మరియు దాని డైరెక్టర్లతో ఈ క్రింది స్థిరాస్థిపై ఎలాంటి క్రయ-విక్రయ మరియు తనఖా వంటి ఎలాంటి లావాదేవీలు జరుపరాదని సమస్త ప్రజలను సంస్థలను మరియు వాణిజ్య బ్యాంకులను హెచ్చరించనైనది. ఎలాంటి లావాదేవీలైనా పై దావా కోర్టు యొక్క తీర్పునకనుసరించి మాత్రమే హక్కులు సంక్రమించునని తెలియజేయుచున్నాను.

స్థిరాస్తి షెడ్యూలు: కరీంనగర్ జిల్లా, రామడుగు మండలం, వెలిచాల గ్రామ శివారులోని భూములు రక్బా ఎ.3-29 గుంటలు, సర్వే నెం. 132 మరియు 133/ఎ లలో భూమికి హద్దులు: తూర్పు: సర్వే నెం. 133 పార్ట్‌లోని భూమి **అక్షర టౌన్‌షిప్ ప్రై. లి.,** పడమర: సర్వే నెం. 132 పార్ట్ లోని భూమి, ఉత్తరం: సర్వే నెం. 132 పార్ట్ లోని భూమి, దక్షిణం: సర్వే నెం. 131 పార్ట్ లోని భూమి & సర్వే నెం. 134 పార్ట్ లోని భూమి.

తేది: 08-10-2024 సం/-, **ఏగిన శ్రీనివాస్,** అడ్వకేట్, కరీంనగర్ - 505001
సప్తగిరి, ఇ.నెం. 3-7-272/2, వావిలాలపల్లి, కరీంనగర్. సెల్: 98490 72875

సంక్షిప్తం

■ పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి

జూలపల్లి: జూలపల్లి తహసీల్దారు కార్యాలయాన్ని అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా మండలంలోని పెండింగ్ సమస్యలను పరిష్కరించాలన్నారు. ధరణి సమస్యలు, ప్రజావాణి, వివిధ దరఖాస్తులను పరిశీలించి ధ్రువపత్రాలను వెంటదివెంట జారీ చేయాలన్నారు. తహసీల్దార్ స్వర్ణ, ఆర్ఐ సందీప్‌రెడ్డి పాల్గొన్నారు.

■ సభ్యత్వ నమోదుపై ఆరా

కమాన్‌పూర్: భాజపా సభ్యత్వ నమోదు తీరుపై మంగళవారం కమాన్‌పూర్‌లో జిల్లా అధ్యక్షుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి పరిశీలించారు. అనంతరం ఛత్రపతి శివాజీయువసేన, సుభాష్‌నగర్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాతను దర్శించుకున్నారు. పార్టీ మండలాధ్యక్షుడు అజయ్, నియోజకవర్గ సభ్యత్వ ఇన్‌ఛార్జి రాము, నాయకులు పాల్గొన్నారు.

■ ఆదివరాహస్వామి హుండీ ఆదాయం రూ.7.29 లక్షలు

కమాన్‌పూర్: కమాన్‌పూర్‌లోని ఆదివరాహస్వామి ఆలయ హుండీ లెక్కింపును మంగళవారం చేపట్టారు. ఆరు నెలలకు సంబంధించి రూ.7,29,879 ఆదాయం వచ్చిందని దేవాదాయ శాఖ పరిశీలకుడు శ్రీనివాస్, ఆలయ ఈవో కాంతారెడ్డి తెలిపారు. తహసీల్దార్ వాసంతి, అర్చకులు వరప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

■ ఎస్సారెస్పీ కాలువలో పూడికతీత పనులు

ఓదెల: ఓదెల మండలం కొలనూర్‌లోని 2వ వార్డులోని ఎస్సారెస్పీ కాలువలో పేరుకుపోయిన మట్టి, చెత్తా చెదారం, గడ్డి, పిచ్చి మొక్కలను మంగళవారం పొక్లయిన్‌తో తొలగించారు. ఇళ్ల మధ్యన ఉన్న ఎస్సారెస్పీ కాలువ నుంచి దుర్గంధం వెదజల్లుతోందని స్థానికులు పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి శుభ్రం చేయించారు.

■ చెక్కుల పంపిణీ

పాలకుర్తి(అంతర్గాం): మండలంలోని పలు గ్రామాలకు చెందిన 102 మంది లబ్ధిదారులకు రూ. 1,02,11,832 విలువగల కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ మంగళవారం పంపిణీ చేశారు. తహసీల్దార్ రమేష్, ఎంపీవో వేణుమాధవ్, ఏవో సతీష్, నాయకులు పాల్గొన్నారు.

■ ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై విస్తృత ప్రచారం

పెద్దపల్లి కలెక్టరేట్: జిల్లాలో ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై విస్తృతంగా ప్రచారం చేయాలని కలెక్టర్ శ్రీహర్ష సూచించారు. రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి నాగిరెడ్డి మంగళవారం నిర్వహించిన దూరదృశ్య మాధ్యమ సమీక్షకు పాలనా ప్రాంగణం నుంచి కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం అధికారులతో మాట్లాడుతూ నవంబరు 6లోగా అర్హులైన ప్రతి ఉపాధ్యాయుడు, పట్టభద్రుడు నమోదు చేసుకునేలా చూడాలన్నారు. ఆర్డీవోలు గంగయ్య, హనుమానాయక్ అధికారులు పాల్గొన్నారు.

■ ఉద్యోగం సాధించిన యువకుడికి సన్మానం

ఓదెల: కొమిరె గ్రామానికి చెందిన కొత్తిరెడ్డి ప్రశాంత్‌రెడ్డి ఇటీవలి డీఎస్సీ ఫలితాల్లో పీఈటీ ఉద్యోగం సాధించారు. మంగళవారం ఆయనను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మూల ప్రేంసాగర్‌రెడ్డి సత్కరించారు. మొండయ్య, రవీందర్‌రెడ్డి, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

■ క్రికెట్ క్రీడాకారుడికి...

కాల్వశ్రీరాంపూర్: ఇద్లాపూర్‌కు చెందిన క్రికెట్ క్రీడాకారుడు బాల్త సాహిత్‌కుమార్‌ను మంగళవారం తహసీల్దార్ ఎండి.వకీల్ సత్కరించారు. అంతర్జాతీయ స్థాయిలో అండర్-19 విభాగంలో శ్రీలంకలో ఆడేందుకు ఎంపిక కావడంపై అతడిని అభినందించారు. ఉప తహసీల్దార్ శంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

■ బోర్‌వెల్ పనులు ప్రారంభం

ఓదెల: ఓదెలలోని శ్మశానవాటికలో బోర్‌వెల్ పనులను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రేమ్‌సాగర్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు. శ్మశానవాటికలో నీటి వసతి లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి బోరుబావి తవ్వించారు. మాజీ సర్పంచి మహేందర్, నాయకులు సదానందం, చిన్న స్వామి తదితరులు పాల్గొన్నారు.

■ సంఘాలు-కార్యవర్గాలు

కమాన్‌పూర్, న్యూస్‌టుడే: పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా నాంపెల్లి రాజ్‌కుమార్‌ను సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పింగళి శ్రీపాల్‌రెడ్డి మంగళవారం నియమించారు. సోమ, మంగళవారాల్లో హైదరాబాద్‌లో నిర్వహించిన 35వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాల్లో ఈ నియామకం చేపట్టారు. రాజ్‌కుమార్ నియామకంపై జిల్లా అధ్యక్షుడు సురేశ్, ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, మండల అధ్యక్షుడు రమేశ్, ప్రధాన కార్యదర్శి సత్యనాయణ హర్షం వ్యక్తం చేశారు.

మార్కండేయకాలనీ: పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా గోదావరిఖనికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయులు సతీష్‌బాబును ఎన్నుకున్నట్లు ఆ సంఘం అధ్యక్షులు శ్రీపాల్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లో జరిగిన 35వ రాష్ట్ర కౌన్సిల్‌లో ఎన్నుకున్నట్లు వెల్లడించారు.

ఫెర్టిలైజర్ సిటీ: హైదరాబాదులో మంగళవారం నిర్వహించిన పీఆర్టీయూ రాష్ట్ర కమిటీ ఎన్నికల్లో రామగుండం బి-థర్మల్ పాఠశాల ఉపాధ్యాయులు రామన్న, ఎన్టీపీసీలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు అంజన్‌కుమార్, రవీందర్ రామగుండం నగరపాలక ప్రాంతానికి చెందిన ముగ్గురు ఉపాధ్యాయులకు స్థానం లభించింది.ఉన్నారు.

పెద్దపల్లి: ఆల్‌ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ ఉమ్మడి జిల్లా కార్యదర్శిగా పెద్దపల్లికి చెందిన బొంకూరి సురేందర్ సన్నీని నియమించినట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండ సురేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

■ ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి

కమాన్‌పూర్(సెంటినరీకాలనీ): నవరాత్రోత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని మంథని సీఐ రాజు అన్నారు. మంగళవారం రామగిరి ఠాణాలో దుర్గామాత నిర్వాహకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సై చంద్రకుమార్ పాల్గొన్నారు.

■ బాలగోపాల్‌కు కొవ్వొత్తులతో నివాళి

గోదావరిఖని: ఆచార్య కె.బాలగోపాల్ వర్ధంతి సందర్భంగా మంగళవారం రాత్రి స్థానిక చౌరస్తాలో పలు సంఘాల నాయకులు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. కుమారస్వామి, విశ్వనాథ్, శంకర్, రాజు, రాయమల్లు, బేగ్, శేఖర్ తదితరులున్నారు.